సాక్షి నిజామాబాద్

ఆదివారం । 23 । జూలై । 2023



‘టోల్’ తీస్తున్నారు!
ఎస్సారెస్పీ సందర్శనకు వచ్చే పర్యాటకుల నుంచి పార్కింగ్ ఫీజు పేరిట వసూళ్లు చేస్తున్నారు. కానీ వసతులు కల్పించడం లేదు.
- 8లో ▸



భీమ్‌గల్ డిపోకు మోక్షం!
ఏళ్ల క్రితం మూతబడ్డ భీమ్‌గల్ ఆర్టీసీ డిపోకు మోక్షం కలగనుంది. డిపోను పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
24.4 /23.0

వాతావరణం
ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లటి గాలులు వీస్తాయి. అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలపై మంత్రి సమీక్ష



వేల్పూర్ : నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలు, కల్పించాల్సిన సౌకర్యాలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌తో శనివారం సాయంత్రం వేల్పూర్‌లోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందజేస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఇంకా ఎటువంటి సౌకర్యాలు అవసరమో ఆరా తీశారు.

కాంగ్రెస్ నేతలను కలిసిన సునీల్‌రెడ్డి





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్/మోర్తాడ్ : కాంగ్రెస్‌లో ఇటీవల చేరిన బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో పలురువు నేతలను మర్యాదపూర్వకంగా కలిశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్‌ను కలిసి ఆయన సన్మానించారు.

వెబ్‌సైట్‌లో ‘కేజీబీవీ పరీక్ష’ హాల్‌టికెట్లు

నిజామాబాద్‌అర్బన్ : ఈ నెల 24 నుంచి నిర్వహించే కేజీబీవీ అర్హత పరీక్ష హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో పెట్టినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు schooledu. telangana. gov. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నగరంలోని నాలెడ్జ్ పార్కు పాఠశాలలో ఆన్‌లైన్‌లో పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలన్నారు. మిగతా వివరాలకు 6305616256, 9177421285 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

‘జాబ్‌మేళా పేరుతో అవమానం’



ఖలీల్‌వాడి : జాబ్‌మేళా పేరుతో జిల్లాలోని నిరుద్యోగులను ఎమ్మెల్సీ కవిత అవమానించారని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో శనివారం ఆయన మాట్లాడారు. ప్రారంభమే కాని ఐటీహబ్ పేరుతో జాబ్‌మేళా నిర్వహించడం హాస్యాస్పదమన్నారు. మేళాలో ఎమ్మెల్సీ కవిత మాట్లాడిన తీరు సగటు నిరుద్యోగిని మనోవేదనకు గురిచేస్తుందన్నారు. 750 ఉద్యోగాలకు పది వేల మంది హాజరయ్యారంటే జిల్లాలో నిరుద్యోగులు ఏ స్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, కేశ వేణు, నరాల రత్నాకర్, రామ్మూర్తి గోపి, విక్కీ యాదవ్, వేణురాజ్, విపుల్ గౌడ్, జావిద్ అక్రమ్, గడుగు రోహిత్, కేశ మహేశ్ పాల్గొన్నారు.



చిన్నయానం వద్ద ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో పశువులు మేపుతున్న కాపరి

పశువులే జీవనం!

సండే స్పెషల్

పశువులు, గొర్ల కాపరుల జీవనవిధానం విభిన్నమైనది. పశువులు, జీవాలతోనే వారి జీవిత కాలం గడిచి పోతుంది. చంకలో సద్దన్నం మూటను పెట్టుకుని, చేతిలో కర్రను పట్టుకుని ఆయా గ్రామాల నుంచి మందలను తొలుకుని ఉదయమే బయలు దేరుతారు. వానకు తడిసి, ఎండలో ఎండి, చలికి వణుకుతూ పశువులు చెదిరిపోకుండా రోజుకు కనీసం పది కిలో మీటర్ల మేర కాలిబాట నడుస్తూ పచ్చిక బయళ్లలో వాటికి మేత మేపిస్తారు. మధ్యలో ఎక్కడైనా ఆగి వెంట తెచ్చుకున్న సద్దన్నం తింటారు. పశువులు ఏ ఒక్కటి తప్పిపోకుండా తిరిగి సాయంత్రం ఆరు గంటలకు సురక్షితంగా గ్రామాలకు చేరుస్తారు. స్వచ్ఛమైన గాలి ఆస్వాదిస్తూ ప్రకృతితో మమేకమై సంచరించే పశు కాపర్ల జీవనం సాధారణ జీవనానికి చాలా తేడా ఉంటుంది. డొంకేశ్వర్ మండల ప్రాంతంలో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ పరిసరాల్లో పశువులను మేతకు తీసుకువెళ్లే కాపారుల జీవితాలను తరచి చూస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తాయి.

- విభిన్నం.. పశు, గొర్ల కాపరుల బతుకు చిత్రం
- కుటుంబాలను వదిలి మందలతో సాగి..
- నిత్యం కిలోమీటర్ల మేర నడక

డొంకేశ్వర్ (ఆర్మూర్) : పశువులు, గొర్లను కాసే కాపర్లు దాదాపు నిరక్ష్యరాస్యులే. కాపరిగా పని చేయాలంటే పడాల్సిన శ్రమ అంతా ఇంతా కాదు. నిజానికి వీరు రోజంతా సమాజానికి దూరంగా మందల మధ్యలోనే జీవనం సాగిస్తారు. పొద్దు పొడవగానే మంద మీదకు వెళ్లాలి. పశువులు, గొర్రెలను ఒక దగ్గరికి చేర్చి వాటితో పాటే పయనించాలి. డొంకేశ్వర్ మండలంలో పశు సంపద ఎక్కువగా ఉండడంతో ఇక్కడి గ్రామాలకు కూలీలు వలస వచ్చి పని చేస్తున్నారు. మహారాష్ట్ర, నిర్మల్, భైంసా ప్రాంతాల వారు ఎక్కువగా ఉన్నారు. కొందరు తమ కుటుంబ సభ్యులతో వచ్చి గ్రామంలోనే ఉంటుండగా, మరికొందరు కుటుంబాలను వదిలి ఇక్కడ నివాసముంటున్నారు. నూత్‌పల్లి, మారంపల్లి, చిన్న యానం, గంగగడ్డ నడ్కుడ, నికాల్‌పూర్, కోమట్‌పల్లి, అన్నారం, సిర్పూర్, డొంకేశ్వర్ గ్రామాల్లో గేదెలు, గొర్రెల మందలకు కాపరిగా కొనసాగుతున్నారు.

జీతభత్యాలు అంతంతే..

గొడ్డు కష్టం చేసినా వారి జీవితంలో గోరంత కూడా మార్పులేదు. తరాలు మారుతున్నా వారి బతుకుల్లో వెలుగులు నిండడం లేదు. ఆర్నెళ్ల, ఏడాదికోసారి వచ్చే కాస్తంత జీతంతోనే జీవన చక్రాన్ని నడుపుతున్నారు. పశువులు, గొర్రెలను కాస్తున్న వలస కూలీలు తమ సొంతూరిని, కుటుంబ సభ్యులను వదిలి ‘కాపరి’గానే కాలాన్ని వెల్లదీస్తున్నారు. పశువుల యజమానులు నిర్ణయించిన జీతానికే వీరు పని చేస్తున్నారు. ఊరి మందను తీసుకెళ్లి మేపినందుకు ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష దాకా వీరికి జీతంగా వస్తుంది. అది కూడా ఆర్నెళ్లు, లేదంటే ఏడాదికోసారి ఇస్తారు. ఏళ్లు గడుస్తున్నా వీరికిచ్చే జీతం ఏ మాత్రం పెరగడం లేదు. ఒక వేళ పెంచినా రెండు, మూడు వేలేనని ‘కాపర్లు’ వాపోతున్నారు. ఇచ్చే జీతంతో ఇంటి అద్దె, నిత్యావసరాలు, కుటుంబ సభ్యుల వ్యవహారాలు, పిల్లల చదువులను వెళ్లదీయడం కష్టంగా మారిందని చెప్తున్నారు. పశువులను కాయడం తప్పా మరే పని రాకపోవడంతో సంవత్సరాల తరబడి కాపరిగానే ఉండాల్సి వస్తోందంటున్నారు.

వేరే పని తెల్వదు



మాది మహారాష్ట్ర. మా ఊర్లో పని దొరక్క డొంకేశ్వర్ మండలానికి వచ్చాను. గేదెలు మేపడానికి పనికి కుదిరా.. నాకు ఇది తప్ప వేరే పని తెల్వదు. పొద్దున్నే మందతో వచ్చి పొద్దు పోయాక తిరిగి వెళ్తాను. ఇంటోళ్లకు దూరంగా ఉంటూ కొన్నేళ్లుగా ఇదే పని చేస్తున్న. అప్పుడప్పుడు ఇంటికి వెళ్లి జీతం పైసలు ఇచ్చి అస్త.

– ప్రభు, పశువుల కాపరి

ఇరవై కిలోమీటర్లు తిరుగుతం



మాది నిర్మల్ జిల్లా. జిల్లాలోని సుర్బిర్యాల్‌లో ఉంటాం. గొర్రెలు కాసే పని ఉందని తెలిసి గాదేపల్లికి వచ్చాను. రెండేళ్లుగా కాపరిగానే పని చేస్తున్నా. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో గొర్లను మేపడానికి రోజూ వస్తాం. 20 కిలో మీటర్ల దాకా నడుస్తూనే ఉంటాం. ఒక్కోసారి వానకు తడుస్తం, ఎండకు ఎండుతం. మాలాంటోళ్లకు జీతం పెంచితే బాగుంటది. – శ్రీనివాస్, గొర్రెల కాపరి



గంగసముందర్‌లో గొర్రెలను మేతకు తీసుకెళ్తున్న కాపరి

ఎస్సారెస్పీలో ‘కేజ్ కల్చర్’

బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో కేజ్ కల్చర్ ద్వారా చేపల ఉత్పత్తిని చేపట్టడానికి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఇందుకోసం 15 రోజుల క్రితం నిర్మల్, నిజామాబాద్ జిల్లాల మత్స్యకారులకు పోచంపాడ్ వద్ద కేజ్‌కల్చర్‌పై మత్స్యశాఖ కమిషనర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రాజెక్టుపై ఆధారపడి ఐదు వేల మత్స్యకారుల కుటుంబాలు జీవిస్తున్నాయి. కేజ్ కల్చర్ ద్వారా తక్కువ విస్తీర్ణం, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ చేపలు పెంచవచ్చని అధికారులు చెబుతున్నారు. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు మేలు జరుగుతుందంటున్నారు. 200 యూనిట్ల వరకు మత్స్యకారులకు సబ్సిడీపై అందించుటకు సన్నాహాలు చేస్తున్నారు. మత్స్యకారులు 60 శాతం చెల్లిస్తే ప్రభుత్వం 40 శాతం భరిస్తుంది. రూ.ఐదు లక్షల నుంచి రూ.30 లక్షల వరకు కేజ్ కల్చర్ యూనిట్లు ఉన్నాయి. ఈ యూనిట్ వ్యక్తిగతంగా, సమూహంగా ఏర్పాటు చేసుకోవచ్చు.

2015లోనే ఏర్పాటు

ఎస్సారెస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టుల్లో కేజ్ కల్చర్ ఏర్పాటుకు ప్రభుత్వం 2015లో రూ.40 లక్షల నిధులు మంజూరు చేసింది. ప్రయోగాత్మకంగా ఎస్సారెస్పీలో యూనిట్ ఏర్పాటు చేశారు. కానీ భారీ అలలు ఉండటం, ఎగువ ప్రాంతాల నుంచి కలుషిత నీరు వచ్చి చేరడంతో అది విఫలమైంది.



గతంలో ఎస్సారెస్పీలో ఏర్పాటు చేసిన కేజ్ కల్చర్

కేజ్ కల్చర్‌లో పెంచిన చేపలు చనిపోయాయి. దీంతో కేజ్ కల్చర్ విధాన ఏర్పాటు అటకెక్కింది. ప్రస్తుతం నూతన టెక్నాలజీతో కేజ్ కల్చర్ ఏర్పాటు చేస్తామని మత్స్యశాఖ అధికారులు తెలుపుతున్నారు. కానీ గతాన్ని దృష్టిలో పెట్టుకుని కేజ్ కల్చర్ ద్వారా చేపల ఉత్పత్తి చేపట్టడానికి మత్స్యకారులు ముందుకు రావడం లేదు.

అవగాహన కల్పిస్తున్నాం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో కేజ్ కల్చర్ ద్వారా చేపలు ఉత్పత్తి చేయుటకు మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు అందించడానికి సిద్ధంగా ఉంది. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

– రాజనర్సయ్య, మత్స్యశాఖ ఏడీ, నిజామాబాద్

దాశరథికి ఘన నివాళి



నిజామాబాద్ సిటీ : తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నగరంలోని ఖిల్లా జైలులో మహాకవి దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. దాశరథి ఖిల్లా జైలులో శిక్ష అనుభవించిన సమయంలో బొగ్గుతో జైలు గోడలపై రజాకార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కవితలను రాశారని గుర్తు చేశారు. జాగృతి రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ భరద్వాజ్, నరాల సుధాకర్, అపర్ల, పులి జైపాల్, పంచరెడ్డ మురళీ, తిరుమల శ్రీనివాస్ ఆర్య, సందీప్, ఆకాష్, విక్కీ, సంపత్ పాల్గొన్నారు.

ఇందూరు కవుల ఆధ్వర్యంలో..

రజాకర్ల దుర్మార్గాలను తన పదునైన కవితలతో ఎదిరించిన మహాకవి దాశరథి అని ఇందూరు కవులు అన్నారు. ఖిల్లా జైలులో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువకవి మద్దుకూరి సాయిబాబు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. కాసర్ల నరేశ్ రావు దాశరథి కృష్ణమాచార్య గురించి ప్రసంగించారు. సిర్ప లింగం, గంట్యాల ప్రసాద్, రాం నరేశ్, చెన్న శంకర్, కర్క రమేశ్, జనగామ చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

భీమ్‌గల్ డిపోను త్వరలో ప్రారంభిస్తాం



భీమ్‌గల్ డిపోను పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ గోవర్ధన్

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి డిపో పరిశీలన

భీమ్‌గల్ : భీమ్‌గల్ ఆర్టీసీ డిపోను త్వరలో ప్రారంభిస్తామని రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మూతబడ్డ బస్ డిపోను ఆయన శనివారం ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తాను చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాలు చూడటానికే ప్రతిపక్ష నాయకులకు రెండేళ్లు పడుతుందన్నారు. భీమ్‌గల్ డిపోను పునఃప్రారంభించేందుకు తాను ఎన్నో ప్రయత్నాలు చేశానన్నారు. మోర్తాడ్ బహిరంగ సభలో కేసీఆర్‌ను అడగ్గా బస్‌డిపో సాధ్యం కాదని చెప్పారని గుర్తు చేశారు. తాను రవాణా శాఖ మంత్రి అయినప్పుడు డిపో ప్రారంభించాలని అనుకున్నట్లు చెప్పారు. కానీ ఆ పదవి పువ్వాడ అజయ్‌కు ఇవ్వడంతో ఆశలు సన్నగిల్లాయని పేర్కొన్నారు. తర్వాత బాజిరెడ్డి గోవర్ధన్‌కు ఆర్టీసీ చైర్మన్ పదవి ఇవ్వడంతో ఆయనను కలిసి విషయం చెప్పగానే సానుకూలంగా స్పందించారన్నారు. 15 రోజుల క్రితం డిపో ప్రారంభ పనులు చేపడుదామని ఆర్టీసీ చైర్మన్ తనకు చెప్పారన్నారు. ఈ విషయం తెలిసి బీజేపీ నాయకులు ధర్నాలు అంటూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. తాను పదవి చేపట్టాక మంత్రి కలిసి భీమ్‌గల్ డిపోను పునఃప్రారంభిద్దామని చెప్పారన్నారు. బాల్కొండ నియోజకవర్గాన్ని మంత్రి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా డిపో పునరుద్ధరణకు రూ.2.5 కోట్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

- ఎడతెరిపి లేని వర్షాలతో జలాశయాల్లోకి చేరుతున్న నీరు
- జిల్లాలో అలుగు పారుతున్న 229 చెరువులు



అలుగు పారుతున్న రుద్రూర్ చెరువు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని జలాశయాలు, చెరువుల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి పంటలకు ఢోకా లేదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1,086 చెరువులు ఉండగా వీటిలో 229 పూర్తిగా నిండి అలుగు పారుతున్నాయి. 296 చెరువుల్లోకి 75శాతం నుంచి 100శాతం మధ్య, 426 చెరువుల్లోకి 50శాతం నుంచి 75శాతం మధ్య, 109 చెరువుల్లోకి 25శాతం నుంచి 50శాతం మధ్య, 26 చెరువుల్లోకి 25శాతం లోపు నీరు వచ్చింది.

- నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 324 చెరువులు ఉండగా 51 చెరువులు అలుగు పారుతున్నాయి. 75 చెరువులు నిండే దశకు వచ్చాయి. 110 చెరువుల్లోకి 75శాతం లోపు, 67 చెరువుల్లోకి సగం వరకు, 21 చెరువుల్లోకి 25శాతం లోపు నీళ్లు వచ్చాయి.
- బోధన్ నియోజకవర్గంలో 182 చెరువులు ఉండగా 87 చెరువులు మత్తడి దూకుతున్నాయి. 43 చెరువులు నిండే దశకు వచ్చాయి. 52 చెరువుల్లోకి 75శాతం లోపు నీరు వచ్చింది.
- ఆర్మూర్ నియోజకవర్గంలో 198 చెరువులకు 38 పూర్తిగా నిండి అలుగు పోస్తున్నాయి. 90 చెరువులు నిండే దశకు వచ్చాయి. 48 చెరువుల్లోకి 75శాతం వరకు నీరు వచ్చింది. 22 చెరువుల్లోకి 50శాతం లోపు నీరు వచ్చింది.
- బాల్కొండ నియోజకవర్గంలో 292 చెరువులు ఉండగా 6 చెరువులు పూర్తిగా నిండాయి. 65 చెరువులు నిండే దశకు వచ్చాయి. 200 చెరువుల్లోకి 75శాతం లోపు నీరు వచ్చింది. 16 చెరువుల్లోకి 50శాతం వరకు నీరు వచ్చింది.
- బాన్సువాడ నియోజకవర్గం పరిధిలోని 6 మండలాల్లో 90 చెరువులు ఉండగా 47 చెరువులు అలుగు పారుతున్నాయి. 23 చెరువులు నిండే దశకు చేరుకున్నాయి. 16 చెరువుల్లోకి 75శాతం లోపు నీరు వచ్చింది.
- ధర్పల్లి మండలంలోని రామడుగు జలాశయంలోకి భారీగా నీరు వచ్చి చేరింది. దీని సామర్థ్యం 966.22 మిలియన్ క్యూబిక్ అడుగులు. ఎత్తు 1,278 అడుగులు కాగా ప్రస్తుతం 1,274.5 అడుగుల మేర నీరు వచ్చింది.
- శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 1,04,997 క్యూసెక్కుల వరద వస్తోంది. జలాశయం పూర్తి సామర్థ్యం 90 టీఎంసీలు (1,091 అడుగులు) కాగా శనివారం రాత్రి వరకు 58.3 టీఎంసీలు (1,082.10 అడుగుల) మేర నీరు నిల్వ ఉంది.

జిల్లాలో వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.)					మండలం	వర్షపాతం
						ఆలూరు	20.5
నవీపేట	25.2	బోధన్	11.7	మెండోర	48.8	ముప్కాల్	44.5
కోటగిరి	81.4	డొంకేశ్వర్	23.8	నిజామాబాద్‌రూరల్	21.3	మోస్రా	16.2
వర్ని	42.8	పోతంగల్	57.8	ధర్పల్లి	23.9	మోపాల్	25.4
డిచ్‌పల్లి	23.8	ఎడపల్లి	38.0	మోర్తాడ్	39.9	కమ్మర్‌పల్లి	45.4
రెంజల్	23.5	సిరికొండ	21.4	వేల్పూర్	28.4	జక్రాన్‌పల్లి	17.4
నందిపేట	22.5	చందూరు	18.1	రుద్రూరు	32.3	భీమ్‌గల్	31.2
ఇందల్వాయి	25.1	ఏర్గట్ల	71.0	సాలూరు	17.0	ఆర్మూర్	19.6
మాక్లూర్	17.9	బాల్కొండ	42.9	నిజామాబాద్‌నార్త్	15.5	నిజామాబాద్‌సౌత్	17.3

క్లుప్తంగా

దరఖాస్తుల గడువు పొడిగింపు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ వేణుగోపాల్‌స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 25లోపు దరఖాస్తులు కళాశాలలో సమర్పించాలన్నారు.

తైక్వాండో, ఒలింపిక్‌ అసోసియేషన్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాజిరెడ్డి జగన్‌



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో శనివారం తైక్వాండో ఫెడరేషన్‌ ఆఫ్‌ ఇండియా అండ్‌ తైక్వాండో ఒలింపిక్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం, రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఇందులో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిజామాబాద్‌ జిల్లా తైక్వాండో అధ్యక్షుడు, ఒలింపిక్‌ సంఘం ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి జగన్‌ ఎన్నికయ్యారు. అలాగే ఒలింపిక్‌ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా తైక్వాండో జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్‌ కుమార్‌లు ఎన్నికయ్యారు. తెలంగాణ తైక్వాండో రాష్ట్ర అధ్యక్షులుగా సతీష్‌ గౌడ్‌, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌ కుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు టీఎఫ్‌ఐ అబ్జర్వర్‌ మల్లారెడ్డి, హైకోర్టు ఎలక్షన్‌ రిటర్నింగ్‌ ఆఫీసర్‌ ఆధ్వర్యంలో జరిగాయి.

కాంగ్రెస్‌ మండలాధ్యక్షుడిపై కేసు

భిక్కనూరు: మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు భీంరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్‌ శనివారం తెలిపారు. తిప్పాపూర్‌ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన కారులో శుక్రవారం రాత్రి కామారెడ్డికి వెళ్తుండగా భిక్కనూరు టోల్‌ప్లాజా మీదుగా వెళ్లగా రూ.90 అకౌంట్‌ నుంచి కట్‌ అయ్యింది. లోకల్‌ వాళ్లకు ఉచితంగా ఉన్నప్పటికీ డబ్బులు కట్‌ అవడంతో భీంరెడ్డి టోల్‌ ప్లాజా వద్దకు వెళ్లాడు. టోల్‌ ప్లాజా మేనేజర్‌ పవన్‌కుమార్‌పై దాడిచేశాడు. ఈ విషయమై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. శనివారం భీంరెడ్డిని తహసీల్దార్‌ ప్రేమ్‌కుమార్‌ ఎదుట బైండోవర్‌ చేయగా రూ.లక్ష రూపాయాల సొంత పూచీకత్తుపై బాండ్‌ రాయించుకుని విడుదల చేశారు.

పర్యాటకుల ‘టోల్‌’ తీస్తున్నారు!

- ఎస్సారెస్పీ వద్ద పార్కింగ్‌ పేరిట వసూళ్లు
- డ్యాంపైకి నేరుగా వెళ్తున్న వాహనాలు
- పట్టించుకోని అధికారులు


శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ వద్ద టోల్‌ వసూలు చేస్తున్న యువకులు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్‌ సందర్శనకు పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో ప్రాజెక్టు వద్ద పర్యాటకుల నుంచి వాహనాల టోల్‌ (పార్కింగ్‌) ఫీజు అంటు వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రాజెక్ట్‌ వద్ద పర్యాటకుల కోసం కనీస అవసరాలు కూడా ఏర్పాటు చేయకుండా, వసూళ్లకు పాల్పడుతుండటంపై సందర్శకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కారుకు రూ.20, బైక్‌కు రూ.10..

ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద సదరు నిర్వాహకులు కారులకు రూ.20 చొప్పున, బైక్‌లకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో పర్యాటకుల వాహనాలను డ్యాంపైకి అనుమతివ్వడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. శుక్రవారం ప్రాజెక్ట్‌ నుంచి ఓ కారు కిందకు దిగుతూ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. అయినా ప్రాజెక్ట్‌ వద్ద వాహనాల పార్కింగ్‌ కోసం ఎలాంటి ఏర్పాట్లు చేపట్టడం లేదు. కానీ వాహనదారుల నుంచి ఫీజును ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వసూళ్ల పర్వాన్ని అడ్డుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

ప్రమాదపుటంచున పర్యాటకులు

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌కు జలకళతో పాటు జనకళ వచ్చి పడుతుంది. ప్రాజెక్ట్‌ సందర్శనకు పర్యాటకులు భారీగా తరలి వస్తున్నారు. ప్రాజెక్ట్‌ ఆనకట్టపై వాహనాలతో తిరుగుతూ సందడి చేస్తున్నారు. అలాగే ప్రాజెక్ట్‌ ఆనకట్టపై నీటివైపు వెళ్తి ప్రమాదకరంగా సెల్ఫీలు దిగుతున్నారు. అయినా అక్కడ ఎవరు పట్టించుకునే వారు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రాజెక్టు అధికారులు స్పందించి పర్యాటకులకు గైడ్‌ చేయాల్సిన అవసరం ఉంది.



నీటి విడుదల షెడ్యూల్‌ ఖరారయ్యేదెప్పుడో?

- ఎస్సారెస్పీ నుంచి ఈ నెలాఖరు వరకైనా వదలాలని ఆయకట్టు రైతుల డిమాండ్‌

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి ఖరీఫ్‌లో కాలువల ద్వారా ఆయకట్టుకు నీటి విడుదల షెడ్యూలు ఇంకా ఖరారు కాలేదు. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల నుంచి భారీగా వరద నీరు రావడంతో ప్రాజెక్ట్‌లో నీటిమట్టం ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. నీటి నిల్వ 60 టీఎంసీలకు చేరుకుంది. ఆయకట్టు ఖరీఫ్‌ సీజన్‌ పంటల సాగుకు ఢోకా లేకుండ నీటి నిల్వ చేరడంతో రైతులు వరి నాట్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. కానీ ఇప్పటి వరకు నీటి విడుదలపై ఎలాంటి ఆదేశాలు రాలేదని ప్రాజెక్ట్‌ ఈఈ చక్రపాణి తెలిపారు.

గతేడాది జూలై మధ్య నుంచే షెడ్యూల్‌..

గతేడాది ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు రావడంతో జూలైలో ప్రాజెక్ట్‌ నుంచి మిగులు జలాలను గోదావరిలోకి వదిలారు. జూలై మధ్య నుంచే నీటి విడుదల చేపట్టారు.


ఆయకట్టు పరిధిలో నారు తీస్తున్న కూలీలు

ప్రస్తుత సంవత్సరం కూడ ప్రాజెక్ట్‌లోకి సకాలంలోనే వరదలు వచ్చినట్లు చెప్పవచ్చు. ప్రాజెక్ట్‌లోకి గత దశాబ్ద కాలంగా అత్యధికంగా ఆగస్టు, సెప్టెంబర్‌లోనే వరదలు వచ్చి చేరేవి. కానీ ఐదు సంవత్సరాలుగా జూలైలోనే వరద నీరు వచ్చి చేరుతుంది. అయినా అధికారులు నీటి విడుదల షెడ్యూలు ఖరారు చేయడంలో జాప్యంతోన మిగులు జలాలు గోదావరి పాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వరి నాట్లు వేయడం జోరందుకుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈనెలాఖరు వరకైనా నీటి విడుదల చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని ఇందిరానగర్‌ కాలనీకి చెందిన మారేలి విజయ్‌(52) కిరాణ దుకాణం నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం రామారెడ్డి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా వెనక నుంచి వచ్చిన ఓ బైక్‌ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్‌ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

నిజాంసాగర్‌(జుక్కల్‌): బూత్‌ల వారిగా పోలింగ్‌ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అడిషనల్‌ కలెక్టర్‌ మను చౌదరి అన్నారు. శనివారం సాయంత్రం నిజాంసాగర్‌ మండల కేంద్రంలోని పోలింగ్‌ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్‌ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

‘దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా కవిత మాటలు’


మాట్లాడుతున్న బీజేపీ మహిళా ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: అవినీతి గురించి ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని నిజామాబాద్‌ మున్సిపల్‌ ఫ్లోర్‌ లీడర్‌ స్రవంతిరెడ్డి అన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కవిత ఎంపీగా ఉన్నప్పుడు, ఆమె తండ్రి సీఎంగా ఉన్నా.. జిల్లాలో కవిత చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. మాధవ్‌నగర్‌ ఆర్‌వోబీ పనులకు సంబంధించిన కాంట్రాక్టర్‌ ఈమె కమీషన్లకు భయపడి పారిపోయిన మాట వాస్తవం కాదా అన్నారు. అర్వింద్‌ ఎంపీగా గెలిచిన తర్వాత గోవింద్‌పేట ఆర్‌వోబీ పనులు పూర్తి చేయించారని, మాధవ్‌నగర్‌, ఆర్మూర్‌ మామిడిపల్లి, అడవి మామిడిపల్లిలో ఆర్‌వోబీల పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. తాను చేసిన అవినీతి గురించి అర్వింద్‌ రుజువు చేయాలని, లేకపోతే పూలాంగ్‌ చౌరస్తాలో ముక్కు నేలకు రాయాలన్న కవిత వ్యాఖ్యలపై స్రవంతిరెడ్డి స్పందించారు. ముందు దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానన్న సీఎం కేసీఆర్‌ తల నరుక్కోవాలన్నారు. ఢిల్లీ లిక్కర్‌ స్కాం కేసును ఈడీ విచారిస్తుందని, నిందితులు ఎవరైనా జైలుకు వెళ్లాల్సిందేనన్నారు. జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరైతే భవన నిర్మాణాల పనులు కవిత ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. రింగ్‌ రోడ్డుకు కేంద్రం నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తయ్యాయని చెప్పారు. స్పైస్‌ బోర్డు తానే తెచ్చానని కవిత చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అర్వింద్‌ను వెంటాడి ఓడిస్తానన్న కవిత ఇప్పుడు మాట మార్చి, అర్వింద్‌ మీద ఎవరు నిలబడ్డా గెలిపించుకుంటామని వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇటీవల సీఎం కేసీఆర్‌ చేసిన సర్వేలో కవిత ఓడిపోతారని తెలవడంతో అర్వింద్‌పై వేరే వారిని పోటీలో దించాలని చూస్తున్నారని ఆరోపించారు. దమ్ముంటే అర్వింద్‌పై పోటీ చేసి గెలవాలన్నారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పంచరెడ్డి ప్రవళిక, కార్పొరేటర్లు సౌజన్య, మమత, ఇందిరా, నాయకురాలు వరలక్ష్మి, జ్యోతి పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే మేలు



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

- జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: క్యాన్సర్‌ వ్యాధిని ముందుగా గుర్తిస్తేనే నివారించే అవకాశం ఉందని జిల్లా జడ్జి సునీత కుంచాల, ప్రముఖ క్యాన్సర్‌ వైద్యురాలు సుధ సిన్హా అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, హైదరాబాద్‌ కేర్‌ క్యాన్సర్‌ ఇనిస్టిట్యూట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో క్యాన్సర్‌ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌పీవీ వైరస్‌తో సర్వైకల్‌ క్యాన్సర్‌ (గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌) వచ్చే ప్రమాదం ఉన్నారు. ఈ వైరస్‌ను ముందస్తుగా గుర్తిస్తే నివారించడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ వైరస్‌ క్యాన్సర్‌గా మారడానికి 15ఏళ్లు పడుతుందని తెలిపారు. ఇతర దేశాలకు చెందిన ఆహార అలవాట్లకు పెద్ద పేగుకు క్యాన్సర్‌ గండం పొంచి ఉన్నదని తెలిపారు. దీనికి సూచనగా కడుపు నొప్పి, మోషన్‌లో రక్తం పడటం పేర్కొన్నారు. పొగ తాగటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్‌లు వచ్చే ప్రమాదం ఉన్నదని వెల్లడించారు. సంస్థ కార్యదర్శి, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌, డాక్టర్‌ సతీష్‌ పవార్‌, నరేన్‌ బోలెనేని, చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ రాజ్‌కుమార్‌ సుబేదార్‌, న్యాయవాదులు తదితరులు సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్రాల్లో దొంగల బీభత్సం

- పలు దుకాణాల్లో వరుస చోరీలు


సీసీ కెమెరాలో రికార్డయిన దుండగుడి దృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో శనివారం వేకువజామున దొంగలు బీభత్సం సృష్టించారు. కొత్త బస్టాండ్‌ ప్రాంతంలోని పలు దుకాణాల్లో గుర్తు తెలియని దుండగులు వరుస చోరీలకు పాల్పడ్డారు. వివరాలు ఇలా.. ఉన్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి వద్ద ఉన్న సాయి శ్రీనివాస మెడికల్‌ షాప్‌ షట్టర్‌ తాళాలను దుండగులు పగలగొట్టి లోనికి ప్రవేశించి, రూ. లక్ష పదివేలను దోచుకున్నారు. సమీపంలోని రుచి చికెన్‌ సెంటర్‌ తాళాలను కూడా పగలగొట్టి రూ.10వేలు ఎత్తుకెళ్లారు. అలాగే కొద్ది దూరంలో ఉన్న వినీలా చికెన్‌ సెంటర్‌ తాళాలు పగలగొట్టి, రూ. 18వేలు చోరీ చేశారు. ఆయా దుకాణాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను సైతం ఎత్తుకెళ్లారు. ఉదయం చోరీలను గుర్తించిన దుకాణ యజమానులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాలను పరిశీలించిన పోలీసులు ఆధారాలు సేకరించారు. ఇతర దుకాణాల సీసీ కెమెరాలను పరిశీలించగా, ఇద్దరు లేదా ముగ్గురు సభ్యుల ముఠా ఈ చోరీలకు పాల్పడినట్లు తెలుస్తోంది. జిల్లాలకు గాని ఇతర రాష్ట్రాలకు చెందిన దొంగల ముఠా చోరీలకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు.

నిజామాబాద్‌ నగరంలో..



ఆటోలో నుంచి బ్యాటరీ తీస్తున్న దుండగుడు


ఖలీల్‌వాడి: నగరంలోని వినాయక నగర్‌, గాయత్రి నగర్‌, సాయి నగర్‌, బైపాస్‌ రోడ్డు ప్రాంతంలో దొంగలు తిరుగడంతో స్థానికులకు భయాభ్రాంతులకు గురయ్యారు. శుక్రవారం అర్ధరాత్రి ముగ్గురు దుండగులు గాయత్రి నగర్‌లో ఓ ఆటో నుంచి బ్యాటరీని చోరీ చేశారు. స్థానిక సీసీటీవీ కెమెరాల్లో ఘటన రికార్డ్‌ అయింది. అనంతరం దుండగులు సాయినగర్‌, గాయత్రి నగర్‌, వినాయక్‌ నగర్‌ ప్రాంతాల్లో తిరిగినట్లు తెలిసింది. బాధితుడు ఆటో డ్రైవర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు.

క్రైం కార్నర్‌

వియ్యంకుడే హంతకుడు!

- నగల కోసమే అక్కాచెల్లెళ్లను హతమార్చిన వైనం
- మూడు రోజుల్లో కేసును చేధించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌


సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌ కుమార్‌


స్వాధీనం చేసుకున్న బంగారు నగలు

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో నాలుగు రోజుల క్రితం జరిగిన అక్కాచెల్లెళ్ల హత్య కేసును పోలీసులు మూడు రోజుల్లో చేధించారు. నగల కోసమే వియ్యంకుడు వారిని హతమార్చాడు. ఆర్మూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఇన్‌చార్జి సీపీ ప్రవీణ్‌కుమార్‌ వివరాలు వెల్లడించారు. ఆర్మూర్‌ మండలం చేపూర్‌ గ్రామానికి చెందిన బండ నడిపి గంగాధర్‌ తన కుమార్తెను ఆర్మూర్‌లోని జిరాయత్‌ నగర్‌కు చెందిన మగ్గిడి తోట గంగవ్వ(గంగు) (58) చిన్న కుమారుడు మహిపాల్‌కు ఇచ్చి వివాహం జరిపించాడు. కాగా గంగవ్వతో పాటు ఆమె అక్క మగ్గిడి మంద రాజవ్వ (రాజుబాయి) (72) జిరాయత్‌నగర్‌లోని ఒకే ఇంట్లో కొన్ని సంవత్సరాలుగా నివాసముంటున్నారు. అక్కాచెల్లెళ్ల వద్ద ఉన్న బంగారు నగలను కాజేయడానికి వియ్యంకుడు గంగాధర్‌ పథకం వేశాడు. అందులో భాగంగా ఈ నెల 18న నిందితుడు తన సొంతూరు చేపూర్‌ నుంచి కామారెడ్డి జిల్లా గాంధారిలోని బంధువుల ఇంటికి వెళ్లి, అక్కడ తన సెల్‌ఫోన్‌ను స్విచ్‌ ఆఫ్‌ చేసి ఆర్మూర్‌కు చేరుకున్నాడు. అనంతరం అదేరోజు రాత్రి పది గంటల సమయంలో వియ్యంకురాలు గంగవ్వ ఇంటికి చేరుకున్నాడు. మరుసటిరోజు వేకువజామున గాఢ నిద్రలో ఉన్న ఇద్దరు అక్కాచెల్లెళ్లను అతడు రోకలి బండతో మోది హతమార్చాడు. హత్యలను ప్రమాదంగా చిత్రీకరించేందుకు ఇంట్లో ఉన్న దుస్తులకు నిప్పు అంటించి ఉదయం నగలతో వెళ్లిపోయాడు.

సీసీ ఫుటేజీతో చిక్కాడు..

గంగాధర్‌ వియ్యంకురాలి ఇంటికి చేరుకోవడం, హత్య చేసి వెళ్లిపోయే దృశ్యాలు సమీపంలో గల ఒక పాఠశాల సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరాన్ని అంగీకరించాడు. నిందితుడు దోచుకున్న పదిన్నర తులాల బంగారు నగలను, హత్యకు ఉపయోగించిన రోకలిబండను స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును చేధించిన ఎస్‌హెచ్‌వో సురేశ్‌ బాబు, ఎస్సైలు గోపి, రాజశేఖర్‌, తిరుపతితో పాటు సిబ్బందిని ఇన్‌చార్జీ సీపీ రివార్డులను అందజేసి అభినందించారు. అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న పాఠశాల కరస్పాండెంట్‌ను సన్మానించారు.

విద్యుత్‌ షాక్‌తో రైతుకు గాయాలు

మోపాల్‌: మండలంలోని ముదక్‌పల్లితండాలో ఓ రైతు విద్యుత్‌ స్తంభం వద్ద మరమ్మతులు చేస్తుండగా కరెంట్‌షాక్‌కు గురై, గాయపడ్డాడు. వివరాలు ఇలా.. తండాకు చెందిన మెగావత్‌ గంగారాం అనే రైతుకు చెందిన వ్యవసాయ మోటార్‌కు గత కొన్ని రోజులుగా విద్యుత్‌ సరఫరా కావడం లేదు. సమస్యలను లైన్‌మన్‌ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో శనివారం గంగారం స్తంభం వద్ద మరమ్మతులు చేయసాగాడు. ఈక్రమంలో అతడికి విద్యుత్‌ సరఫరా కావడంతో గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

కోతుల దాడిలో ఒకరికి..



నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని మహమ్మద్‌నగర్‌ బస్టాండ్‌ వద్ద శనివారం సాయంత్రం కోతులు మూకుమ్మడిగా దాడి చేయడంతో గ్రామానికి చెందిన గంగారాం అనే వ్యక్తి గాయపడ్డాడు. బస్టాండ్‌ ప్రాంతం నుంచి దుకాణానికి వెళ్తుండగా గంగారాంపై కోతులు దాడి చేయడంతో అతడి చేతివేళ్లకు గాయాలు అయ్యాయి. స్థానికులు అతడిని ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

కారు బోల్తాపడటంతో నలుగురికి..


పంటపొలాల్లో బోల్తాపడిన కారు

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని సుల్తాన్‌నగర్‌ గ్రామ సమీపంలో శనివారం ఓ కారు పంటపొలాల్లోకి వేగంగా దూసుకువెళ్లి బోల్తా పడింది. ఈప్రమాదంలో గోర్గల్‌ గ్రామానికి చెందిన అజ్జం సాయిలు, నగేష్‌తో పాటు మరో ఇద్దరికి గాయాలు అయ్యాయి. కారును డ్రైవర్‌ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



శ్రావణ్‌ కుమార్‌ (ఫైల్‌)

మద్నూర్‌(జుక్కల్‌): మండలకేంద్రం సమీపంలోని జాతీయ రహదారి 161పై శనివారం రాత్రి ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మద్నూర్‌లోని కిరాణ దుకాణ వ్యాపారి గాండ్ల సంతోష్‌కు శ్రావణ్‌(22), సంపత్‌ ఇద్దరు కుమారులు, కూతురు శ్రావణి ఉన్నారు. వీరు ముగ్గురు బీటెక్‌ చదువుతున్నారు. పెద్ద కుమారుడైన శ్రావణ్‌ శనివారం పాన్‌ కార్డు కోసం బైక్‌పై మహారాష్ట్రలోని దెగ్లూర్‌కు వెళ్లాడు. తిరిగి సొంతూరు వస్తుండగా హైవే ఫ్లైఓవర్‌పై గుర్తు తెలియని వాహనం అతడి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

నేడు కళాశాలకు వెళ్దామనుకుంటే..

శ్రావణ్‌ ఆంధ్ర ప్రదేశ్‌లోని వైజాగ్‌ గీతం యూనివర్సిటీలో బీటెక్‌ ఫైనల్‌ ఇయర్‌ చదువుతున్నాడు. సెలవులు ఉండటంతో ఇటీవల ఇంటికి వచ్చాడు. ఆదివారం తిరిగి కళాశాలకు వెళ్లాల్సి ఉంది. కానీ రోడ్డు ప్రమాదంలో శ్రావణ్‌ మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరవుతున్నారు. మద్నూర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ యువకుడు..


గుర్రపు రాజు(ఫైల్‌)

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): ఓ యువ రైతు పొలంలో కేజ్‌వీల్‌ ట్రాక్టర్‌ నడిపిస్తుండగా ప్రమాదవశాత్తు కేజ్‌వీల్‌ కింద పడటంతో తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని మర్కల్‌ గ్రామానికి చెందిన గుర్రపు రాజు(28) ఈ నెల 19న తన సొంత ట్రాక్టర్‌తో వేరే రైతు పొలంలో కేజ్‌వీల్‌ నడపడానికి వెళ్లాడు. పొలంలో అతడు కాలుజారి పడిపోగా పైనుంచి కేజ్‌వీల్‌ పోవడంతో తీవ్రంగా గాయాలపాలయ్యాడు. వెంటనే క్షతగాత్రుడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స ఖర్చు భరించలేక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ప్రియాంక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తోట రాజేశ్‌ తెలిపారు.

పెట్రోల్‌బంక్‌ సిబ్బందిపై యువకుల దాడి

ఎడపల్లి(బోధన్‌): పెట్రోల్‌ బంక్‌ సిబ్బందిపై పలువురు యువకులు దాడికి పాల్పడిన ఘటన మండలంలోని జానకంపేట గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జానకంపేట గ్రామంలోని ప్రవీణ్‌ పెట్రోల్‌ బంక్‌లో శుక్రవారం ముగ్గురు యువకులు బైక్‌లో పెట్రోల్‌ పోయించుకున్నారు. బంక్‌ సిబ్బంది డబ్బులు అడగగా ఫోన్‌పే చేశామని ఆ యువకులు చెప్పారు. దీంతో మెసేజ్‌ చూపమని బంక్‌ సిబ్బంది శ్రీధర్‌, సంజీవ్‌ అడగడంతో ముగ్గురు యువకులతో పాటు వచ్చిన మరో ముగ్గురు యువకులు కలిసి వారిపై దాడి చేస్తూ విచక్షణ రహితంగా కొట్టారు. సిబ్బందికి తీవ్ర గాయాలు కావడంతో బంక్‌ యజమాని క్షతగాత్రులను బోధన్‌ ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆస్తిలో వాటా రాదనే బెంగతో ఆత్మహత్య

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలంలోని వజ్జపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహిత ఆస్తిలో వాటా రాదనే బెంగతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై తోట రాజేశ్‌ తెలిపిన వివరాలు ఇలా.. వజ్జపల్లికి చెందిన గాండ్ల లావణ్య(25) అనే వివాహిత పుట్టినిళ్లు రాజంపేట మండలంలోని పెద్దాయిపల్లి. ఆమెకు అక్క, సోదరుడు ఉన్నారు. ఆమె తల్లిదండ్రులకు చెందిన నాలుగెకరాల భూమిని ముగ్గురు సమానంగా పంచుకోవాలని ఉండగా, ఆ భూమిని తన అక్క పేరు మీద రిజిస్ట్రేషన్‌ చేయించుకుంది. ఆ భూమి తనకు చెందుతదో లేదోనని బెంగతో లావణ్య జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు గోవింద్‌ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు, భర్త స్వామి ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి!..

ఖలీల్‌వాడి/నిజామాబాద్‌ సిటీ: నగరానికి చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. నగరంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన చందూర్‌ సునీల్‌కుమార్‌(43) ఆర్థిక ఇబ్బందులు భరించలేక బాసర వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. మృతదేహం కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అంతకుముందు సునీల్‌ ‘నేను ఉండలేను, పిల్లలు జాగ్రత్త’ అంటూ భార్యకు వాట్సప్‌లో మెసెజ్‌ పంపాడు. దీంతో కుటుంబసభ్యులు అతడి కోసం గాలించగా ఆచూకీ లభించలేదు. అనంతరం వారు సునీల్‌ అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.